క్లుప్తంగా

శ్రీనివాసునికి చందనం, డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):అక్షయ తృతీయను పురస్కరించుకుని చిట్టినగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో స్వామి వారు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున స్వామి వారికి ఆలయ అర్చకులు రామ రత్నమాచార్యులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం చందనం, డ్రైఫ్రూట్స్‌లో జీడిపప్పు, కిస్‌మిస్, కర్జూర, బ్లూబెర్రీ, స్ట్రాబెరీ, అక్రూట్‌లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించగా, ఆలయ కార్యవర్గ సభ్యులు, దేవస్థాన కమిటీ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఉభయదాతలు, భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. సాయంత్రం స్వామి వారికి పంచహారతుల సేవ నిర్వహించారు.

వన్‌టౌన్‌లో భారీ వర్షం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వన్‌టౌన్‌లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. ఎండలతో అల్లాడుతున్న ప్రజానీకం వర్షంతో సేదతీరారు. భారీగా కురిసిన వర్షంతో ఒక్కసారిగా వర్షపునీరు రావటంతో కొద్దిసేపు ఆయా ప్రాంతాల్లో మురుగునీరు నిలిచిపోయింది. దాంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం జనజీవనాన్ని స్తంభింపింది. అంతేకాకుండా వర్షం కారణంగా పాత బస్తీలోని పలు ప్రాంతాల్లో రాకపోకలకు విఘాతం కలిగింది.

దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ):గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఏడాదిన్నర వయసుగల చిన్నారి ఎలమండ్ల విహాశ్రీకి ఒకసారి బైపాస్ సర్జరీ చేశారు. ఈ క్రమంలో ఆ చిన్నారికి రెండవ పర్యాయం కూడా ఆపరేషన్ చేయాల్సి ఉంది. చిట్టినగర్‌కు చెందిన బాధితురాలు చిన్నారికి తండ్రి లేకపోవడంతో తల్లి అనూష కుమార్తె వైద్య ఖర్చుల కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించింది. దీంతో ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు వారి ఇంటికి వెళ్లి రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం అందచేసి చేయూత ఇస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులకు బాధితురాలి తల్లి అనూష కృతజ్ఞతలు తెలియజేసింది. విజయవాడ సిటీ పోలీసు పక్షాన స్థాపించిన దీవెన ఫౌండేషన్ సభ్యులు సహాయ, సహకారాలతో పేదలకు విద్య, వైద్యం ఖర్చుల నిమిత్తం తమ వంతుగా ఆర్థిక సాయం అందచేస్తున్నామని పేర్కొన్నారు. సహకరిస్తున్న గ్రూప్ సభ్యులందరికీ ధన్యవాదాలని హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

వైభవంగా గంగానమ్మ పుట్టిన రోజు వేడుక



నున్న(విజయవాడరూరల్): గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా మూడవ రోజు గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ట చేసిన రోజు, అక్షయ తృతీయ పురస్కరించుకొని నున్న గ్రామంలోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం నుంచి 108 మంది భక్తులు మహిళలు, కన్యలు, జల బిందెలతో అమ్మవారికి అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. నున్న గ్రామంలో గంగానమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించిన రోజు భక్తులు పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం పంబళ్లచే శ్రీగంగానమ్మ అమ్మవారి జీవిత చరిత్ర ఆలపించారు. మహాకుంభ నివేదన, బోనాల సమర్పణ, మహాపూర్ణాహుతి, వేదస్వస్తి, హారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం మేళతాళాలతో అమ్మవారి గ్రామోత్సవం బోడపాడు, నున్న గ్రామాల్లో జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శించుకున్నారు.

బీజేపీ బరితెగింపు

- పశ్చిమంలో అడ్డగోలుగా ఓట్ల కొనుగోలు
- రోడ్లపైనే లక్షలాది రూపాయాలు వెదజల్లుతున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు



ఇచ్చిన నగదును లెక్కపెడుతున్న మహిళలు


వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్నికలు మరో రెండు రోజులే ఉండటంతో పశ్చిమ నియోజకవర్గంలో ఓట్ల కొనుగోలుకు బీజేపీ బరితెగించింది. నియోజకవర్గంలో వివిధ డివిజన్లలో రెండు రోజుల నుంచి ఓట్ల కొనుగోలుకు సుజనాచౌదరి ప్రైవేట్ సైనం మోహరించింది. డివిజన్లలో స్థానిక బీజేపీ, టీడీపీ నేతలు స్థానికులను పరిచయం చేయటం, సుజనా ప్రైవేట్ సైన్యం వ్యక్తులు ఆయా ఓట్లను కొనుగోలు చేయటం భారీగా కొనసాగుతోంది. నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు, దళిత వర్గాలు అధికంగా ఉన్న డివిజన్లలో ఓట్ల కొనుగోలు ప్రక్రియను ముందుగా బీజేపీ నేతలు ప్రారంభించారు. గురువారం నుంచే ఏకంగా దుకాణాలు తెరవటంతో స్థానిక పెద్దలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత బరితెగింపు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో బీజేపీకి ప్రజల నుంచి ఆదరణ కరువవ్వటంతో ఓట్లు కొనుగోలే మార్గమని ఆ దిశగా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీలో చేరిన ఇతర పార్టీల నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఒకప్పుడు రాత్రి వేళ ఇంటికి వెళ్లి ఓట్లు కొనుగోలు చేయటం వినిపించేది. కానీ బీజేపీ పశ్చిమ నియోజకవర్గంలో రెండు రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా అదే పనిలో నిమగ్నమైంది. నియోజకవర్గంలోని రోడ్లపైనే సుజనాచౌదరి ప్రైవేట్ సైన్యం లక్షలాది రూపాయలను పట్టుకొని తిరుగుతున్నారు. మీ ఓటు కార్డులు తీసుకురండి, డబ్బులిస్తామంటూ బహిరంగంగానే ఓట్ల కొనుగోలుకు పాల్పడుతున్నారు. కేదారేశ్వరపేట, పూర్ణానందపేట, లంబాడీపేట, వించిపేట తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా రోడ్లపైనే దుకాణాలు తెరిచినట్లుగా ఓట్ల కొనుగోలు చేస్తున్నారు. కొండ ప్రాంతాల్లోనూ అదేరీతిలో ఓట్లు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా కొండ ప్రాంతాల్లోని అడ్డరోడ్లపై చిరుదుకాణాల మాదిరిగా కూర్చొని ఓట్ల కొనుగోలుకు తెగబడుతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు....

పశ్చిమ నియోజకవర్గంలోని రోడ్లపై టీడీపీ, జనసేన, బీజేపీలు బహిరంగంగా ఓట్లు కొనుగోలు చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఓట్ల కొనుగోలుకు సంబంధించి అధికారులకు వీడియోలు, ఫొటోలను పంపించినా పట్టించుకోవటం లేదని స్థానిక ప్రముఖులు చెబుతున్నారు. 48వ డివిజన్‌లో ఓట్లు కొనుగోలు చేస్తున్న వీడియోను నియోజకవర్గ ఎన్నికల అధికారులకు పంపించినా అటుగా వారు దృష్టి పెట్టలేదని విమర్శిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కానూరుకు చెందిన వ్యక్తులు బీజేపీ పక్షాన నైజంగేట్ వద్ద ఓట్లు కొనుగోలు చేస్తున్న సమయంలో అటుగా వెళ్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ వారిని చూసి అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించింది. డబ్బు పంపిణీకి సుమారు 50 బృందాలు తిరుగుతున్నాయని బీజేపీ నేతలే బహిరంగంగానే చెబుతున్నారు. వాటిపై దృష్టి పెట్టాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీకే నగరాల మద్దతు

నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయన బాబూజీ



ఆసిఫ్‌ను కలిసి మద్దతు తెలుపుతున్న బాయన బాబ్జీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఈ నెల 13వ తేదీన నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నగరాల కులస్తులందరూ మద్దతుగా నిలబడాలని ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయన బాబూజీ (బాబ్జి) పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న ఆసిఫ్‌కు మద్దతు పలికారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వెనుకబడిన నగరాల సామాజికవర్గాన్ని గుర్తించి, బీసీ హోదా కల్పించారని తెలిపారు. ఆయనకు యావత్ నగరాలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఆ బీసీ హోదా వలన తమ పిల్లలు ఇప్పుడిప్పుడే ఇంజినీర్లుగా, డాక్టర్లుగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత జగన్ పాలనలో నగరాలకు పెద్దపీట వేసి అనేక కీలక పదవులను అందించారని చెప్పారు. దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ పదవిని, నగర మేయర్ పదవులను అందించారన్నారు. అలాగే నగరాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. శ్రీశైలం ధర్మకర్తల మండలిలో ధర్మకర్తగా తమ సంఘీయుడికి కేటాయించారన్నారు. శ్రీశైలంలో నగరాల అన్న సత్రము నిర్మాణానికి 50 సెంట్ల స్థలం, మధురవాడలో మరో 50 సెంట్ల స్థలం కేటాయించారని వెల్లడించారు. నగరాల కులస్తులందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా నాలుగు జిల్లాలకే పరిమితమైన బీసీ హోదాను రాష్ట్రం మొత్తం వర్తింపజేసి నగరాల కులానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. రానున్న ఎన్నికలలో విజయవాడలో వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేస్తున్న కేశినేని నాని, షేక్ అసిఫ్, వెల్లంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్‌లతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరాల కులస్తుందరూ తమ ఓటును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే నగరంలో వివిధ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ పక్షాన ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు గురుమహంతు మహేష్, దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొరగంజి భాను, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బంక శ్రీను పార్టీ నాయకులు బైపిళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• అక్కచెల్లెమ్మల జీవితాల్లో అనూహ్య మార్పులు



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో అక్కచెల్లెమ్మల జీవితాల్లో అనూహ్య మార్పులు వచ్చాయని ఎమ్మెల్సీ పోతుల సునీత, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం సాయంత్రం పశ్చిమ నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్ నెహ్రూ బొమ్మ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి పాలఫ్యాక్టరీ వరకు సాగిన ఈ ర్యాలీలో పలువురు మహిళా కార్పొరేటర్లు, నాయకురాళ్లు, కార్యకర్తలు ప్లకార్డ్స్ చేతబూని పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జగనన్న చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. – భవానీపురం(విజయవాడపశ్చిమ)



ర్యాలీగా వస్తున్న వాసిరెడ్డి పద్మ, పోతుల సునీత, భాగ్యలక్ష్మి ఆసిఫ్ తదితరులు

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు రెడ్డి సామాజికవర్గ ప్రజానీకం యావత్తు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు, విజయవాడ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బిక్క నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకట రెడ్డి ఒక ప్రకటనలో పిలుపు ఇచ్చారు. భవిష్యత్‌లో ఐదేళ్లపాటు ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగింపునకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. పొరపాటున చంద్రబాబు కూటమికి ఓటేస్తే సంక్షేమ పథకాలు ముగింపేనని, ఆలోచించి ఓటు వేయాలని కోరారు. 2014–19లో చంద్రబాబు దరిద్రపు పాలన చూసి ఉంటారని, 2019–24లో సీఎం జగనన్న ప్రభుత్వ పారదర్శక సంక్షేమ పాలన కూడా చూసి ఉంటారని, వాటి మధ్య ఉన్న తేడాను గమనించి ఓటు వేయాలని పేర్కొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయండి

పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. కండ్రికలో శుక్రవారం సెంట్రల్ నియోజకవర్గం ముస్లిం యువకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు, రాజకీయపరంగా అనేక మందిని నామినేటెడ్ పోస్టుల్లో నియమించడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని అన్నారు. అలాగే ఆజాద్ ముస్లిం కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ కొత్త సభ్యత్వం ప్రోత్సహించాలని సూచించారు. కండ్రిక ప్రాంతానికి చెందిన షేక్ షబ్బీర్ హుస్సేన్‌ను కోశాధికారిగా నియమించారు.

ఎస్ఆర్ఆర్‌లో జూన్ 28 నుంచి జాతీయ స్థాయి సెమినార్



జాతీయ స్థాయి సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పోలా భాస్కర్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూన్ 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సెమినార్ బ్రోచర్‌ను శుక్రవారం ఉన్నత విద్య కళాశాల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీసేందుకు సెమినార్‌లు దోహదపడతాయని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వచ్చే నెల 28, 29 తేదీల్లో 'మేథమెటికల్ మెథడ్స్, మోడల్స్ అండ్ అప్లికేషన్స్ ఇన్ మల్టిడిసిప్లినరీ రీసెర్చ్ అండ్ ఆక్వా కల్చర్ ఫ్రమ్ జెనెస్ టు ఎకోసిస్టమ్' అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆ సెమినార్‌లో రీసెర్చి ఆర్టికల్స్ అండ్ అబ్‌స్ట్రాక్ట్స్‌ను ఈనెల 11వ తేదీ నుంచి స్వీకరిస్తామని తెలిపారు. సంబంధిత పత్రాలు యూజీసీ కేర్‌లిస్ట్‌లో ప్రచురింపబడతాయని పేర్కొన్నారు. పోస్టర్, ఓరల్ ప్రజంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కె.సుధాకర్‌రావు, జె.నాగేశ్వరరావు, కె.నాగలక్ష్మి, కె.సుధాకర్, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

వర్షం నీరు నిల్వ ఉంచకుండా చర్యలు



నీటి తొట్టెలలో పెరుగుతున్న లార్వాను పరిశీలిస్తున్న మలేరియా అధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఇంటి ఆవరణలోని నీటి తొట్టెలు, డబ్బాలలో వర్షం నీరు నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకోవాలని మలేరియ సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బారావు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని జిల్లా మల్లేరియా అధికారులు శుక్రవారం చిట్టినగర్ పరిధిలోని పలు డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కేఎల్‌రావు నగర్ ప్రాంతంలో పర్యటించిన సందర్భంలో రోడ్డు పక్కన ఉపయోగంలో లేని నీటి తొట్టెలలో దోమల లార్వా వృద్ధి చెంది ఉండటాన్ని అధికారులు గుర్తించారు. వాడుకలో లేని నీటి తొట్టిలలో వర్షం నీరు చేరడం వల్ల దోమల లార్వా వృద్ధి చెందుతుందని, తద్వారా మలేరియా, డెంగీ వంటి జ్వరాలను వ్యాపించే అవకాశం ఉందన్నారు. నీటి తొట్టెలను వారంలో ఒక రోజు శుభ్రంగా కడిగి తడి ఆరే వరకు ఉంచాలన్నారు. పాత సామగ్రి, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలలో వర్షం నీరు చేరకుండా వాటిని తిరగేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ ఎస్. రాంబాబు, హెల్త్ అసిస్టెంట్స్, శానిటరీ సెక్రటరీలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

దళిత ద్రోహి మందకృష్ణ మాదిగ

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెనడి



మాట్లాడుతున్న కెనడి, సురేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): దళితులంటే మొదటి నుంచి చిన్నచూపు ఉన్న చంద్రబాబు వారిని విభజించి రాజకీయ లబ్ధి పొందేందుకు విజయవాడలో దళిత ద్రోహి మంద కృష్ణ మాదిగతో ర్యాలీ చేయించడం చంద్రబాబు కుట్రలో భాగమేనని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెనడి తెలిపారు. దళితులకు చంద్రబాబు ఏం చేశాడని ఓటెయ్యాలని ప్రశ్నించారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అన్నందుకు వేయాలా.. అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని తుంగలో తొక్కి కులాలు, మతాలను విడగొట్టే మతతత్వ పార్టీ బీజేపీ వంచన చేరినందుకు ఓటెయ్యాలా అంటూ మండిపడ్డారు. నిన్న ఒక ప్యాకేజి నాయకుడు విజయవాడ వచ్చి భవిష్యత్‌లో ప్రజలకు ఏం చేస్తాడో చెప్పడు, ఏ విధమైన హామీ ఇవ్వడు, కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే ధ్యేయంగా రోడ్ షో చేశాడని విమర్శించారు. దళిత క్రైస్తవులను ఊచ కోత కోసిన దుర్మార్గమైన బీజేపీ ప్రభుత్వంతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన పార్టీలను ఈ రాష్ట్రం నుంచి తరిమి తరిమి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. దేశంలో పలు బ్యాంకులను వేల కోట్ల రూపాయలకు మోసం చేసిన సుజనా చౌదరి డబ్బు సంచులతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ప్రజలను కొనేసి గెలుద్దామనుకోవడం బ్యాంకులను మోసం చేసినంత తేలిక కాదన్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు దళితులంతా అండగా ఉండి గెలిపించుకుంటామని చెప్పారు.

ఉద్యమాల పేరుతో దండుకుంటున్న మంద కృష్ణ....

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేదర సురేష్ మాట్లాడుతూ మద్దతు ఇచ్చిన ప్రతిసారీ దళితుల కోసం ఏమైనా చేశారా అని చంద్రబాబును అడిగారా అని మంద కృష్ణ మాదిగను ప్రశ్నించారు. ఓటు బ్యాంక్ కోసం, కుటుంబ సౌలభ్యం కోసం, సంపదను పెంచుకోవడం కోసం దౌర్భాగ్య పార్టీల కూటమికి మద్దతు పలుకుతారా అని నిలదీశారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టడానికి వచ్చావా, 75 సంవత్సరాల తరువాత రాష్ట్రంలో ఇన్ని సంక్షేమ పథకాల అమలు జరగటం నువ్వు చూశావా అంటూ మంద కృష్ణ మాదిగపై ధ్వజమెత్తారు. పదిహేను రోజు క్రితం ఏలూరులో దళితులపై దాడి జరిగితే కూటమితో పొత్తు పెట్టుకున్న మీరు ఎందుకు నిలదీయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత మహిళ, హోం మంత్రి తానేటి వనితపై టీడీపీ దాడి చేస్తే ఎందుకు అడగలేదు, ప్రకాశం జిల్లాలో ఒక మహిళపై దాడి జరిగితే ఎందుకు నిలదియ్యలేదని మండిపడ్డారు. ఉద్యమాల పేరుతో దండుకుంటున్న ఆయన దందాలు ఇక చెల్లవని హెచ్చరించారు. పేదవాడు, నిజాయతీపరుడైన షేక్ ఆసిఫ్‌ను సీఎం జగనన్న పశ్చిమంలో నిలబెడితే ఆయనపై ఆర్థిక నేరగాడిని నిలబెట్టిన బీజేపీతో కలవడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కామళ్ల జోజి, తాండ్ర ఇంద్ర కుమార్, జిల్లా, నగర నాయకులు బూదాల శ్రీను, గోమతోటి వినోద్, గాలి దుర్గారావు, గాలి నాగరాజు, దొడ్డ సురేష్, రుద్రపాటి స్రవంతి, కె.కమాలాకర్, మంటి రాము, కర్రె రమేష్, వడ్డాది అనిత, ఉస్తేల చలపతిరావు, సీహెచ్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ తాపీ కార్మికుడు మృతి

కంకిపాడు: భవనంపై నుంచి పడి గాయపడ్డ తాపీ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు..ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడుకు చెందిన కిమిడి లక్ష్మణరావు తాపీ కార్మికుడు. మేస్త్రి ఎలుకల శ్రీనివాసరావు వద్ద పని చేస్తున్నాడు. ఈనెల 8న ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్ పరిధిలో హరివిల్లు వెంచర్‌లో చలసాని భార్గవ్ ఇంటి పనికి వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం లిఫ్ట్ దగ్గర పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ కింద పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 9వ తేదీ రాత్రి మృతి చెందాడు.

• బెజవాడలో భారీ వర్షం





బెజవాడలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గంటసేపు కుంభవృష్టిగా వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. బెంజిసర్కిల్ సమీపంలో రోడ్ల మధ్యలో వర్షపు నీరు చేరింది. నిర్మల కాన్వెంట్ రోడ్డులో రోడ్లు నీట మునిగాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





టీడీపీ నేత ఎంఎస్ బేగ్ ఇంట్లో తనిఖీలు



బేగ్ ఇంటి ముందు అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): టీడీపీ ఎంఎస్ బేగ్ ఇంట్లో పోలీసులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. బేగ్ ఇంటి నుంచి భారీ ఎత్తున నగదు పంపిణీ జరుగుతున్నట్లు సమాచారం రావటంతో ఎన్నికల అధికారులు పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఇంటితో పాటుగా పార్టీ కార్యాలయంలోనూ తనిఖీలు నిర్వహించారు. రెండు రోజులుగా వించిపేటలో ఓట్లు కొనుగోలు ముమ్మరంగా జరుగుతుండటంతో అధికారులు ఈ దాడులకు పాల్పడ్డారు.